క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా



ఎస్సైతో వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మహేంద్రను రేబాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. పార్టీ నేతలు పి.శ్రీనివాసరెడ్డి, మస్తానయ్య, హరిప్రసాద్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకుటూరులో అన్నదానం



వెంకటాచలం : విజయదశమి పండగను పురస్కరించుకుని మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వరాల సాయిబాబా మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి బాబా మందిరాన్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన చల్లా కోదండయ్య, చల్లా రమణయ్య, సోమయ్య, పరంధామయ్య, సిద్దయ్య, శేషాద్రి ఉభయకర్తలుగా వ్యవహరించి భక్తులను అన్నదానం చేశారు.

జీవన ఎరువులను వినియోగించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

విడవలూరు : రైతులు జీవన ఎరువులను వినియోగించాలని వ్యవసాయశాఖ జిల్లా సహాయ సంచాలకులు సి.మారుతిదేవి సూచించారు. మండల కేంద్రంలో ఆత్మ సౌజన్యంతో చౌకచర్ల, గాదెలదిన్నె, వావిళ్ల, దంపూరు రైతులకు శిక్షణా కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం తరువాత నార్లు పోసుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.లోకేష్ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి శైలజాకుమారి మాట్లాడుతూ వరిలో ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం గురించి తెలియజేశారు. వీఏఏలు చెంచులక్ష్మి, వెన్నెల, శరణ్ బాబు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పోషక పదార్థాల పంపిణీ



పోషకాహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొడవలూరు : మండలంలోని కొత్తవంగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన వారికి అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా తయారు చేసిన పోషకాహార పదార్థాలను సర్పంచ్ ఎ.సింధు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పోషకాహార పదార్థాలను సులువుగా తయారు చేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.సుజాత, ఐ.విజయ, యు.వెంకటరమణమ్మ, కె.కుమారి, ఎం.భారతి, పి.మాధవి, ఎం.పద్మ, టి.సుప్రజ, ఎస్.కామేశ్వరి పాల్గొన్నారు.

విష్ణాలయంలో ఏకాదశి పూజలు



ఆలయం వద్ద అన్నదానం

మనుబోలు : మనుబోలులోని విష్ణాలయంలో ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు హనుమాచార్యులు పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉభయకర్తలుగా శివారెడ్డి వెంకటకృష్ణారెడ్డి–శ్రీలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

- రోగులకు మందుల పంపిణీ

పొదలకూరు : మండలంలోని డేగపూడి ప్రాథమిక పాఠశాలలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. గ్రామస్తుల వివిధ రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించారు. పొదలకూరు కో–లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌రిషిత పర్యవేక్షణలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. ఇంటింటి సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో పొదలకూరు సీహెచ్‌సీ వైద్యనిపుణులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తిక్కవరప్పాడులో..

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లతో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పొదలకూరు : రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

677 మందికి వైద్య పరీక్షలు

కొడవలూరు : మండలంలోని కొత్తవంగల్లులో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన కార్యక్రమంలో 677 మంది వైద్య సేవలందుకున్నారు. కంటి సమస్యలకు సంబంధించి 183 మంది, ఇతర ఆరోగ్య సమస్యలపై 494 మంది పరీక్షలు చేయించుకుని మందులు పొందారు. వీరిలో కొందరికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన చికిత్సకు పంపేందుకు చర్యలు తీసుకున్నారు. వైద్య నిపుణులు రాజేష్‌రెడ్డి, మనీష్, శశికళ, పీహెచ్‌సీ వైద్యులు ఎం.రామకృష్ణ, లత, కావ్య వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండల కేంద్రానికి ఎంతో దూరంలో ఉన్న కొత్తవంగల్లులో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 677 మంది వైద్య పరీక్షలు చేయించుకోవడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ కల సాకారమయ్యేలా ప్రతి చోటా సురక్ష కార్యక్రమాన్ని భారీ సంఖ్యలో సద్వినియోగం చేసుకోవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత చక్కా మనోహర్‌బాబు, సర్పంచ్ ఆమువరపు సింధు, ఎంపీటీసీ సభ్యుడు నంబూరి ప్రసాద్, ఉప సర్పంచ్‌లు చక్కా శైలజ, మధురెడ్డి, పార్టీ నాయకులు వేముల వెంకటేశ్వర్లు, సీహెచ్.శ్రీనివాసులురెడ్డి, వేముల నవీన్, పంచాయతీ కార్యదర్శి శిఖామణి పాల్గొన్నారు.

పేదలందరికీ ఖరీదైన వైద్యం

ముత్తుకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలందరికీ ఖరీదైన వైద్యం అందుతోందని ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. మండలంలోని పొట్టెంపాడులో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా స్పెషలిస్ట్ డాక్టర్లు 309 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లంరెడ్డి జనార్దన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రత్యూష, సూపరింటెండెంట్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరు : మందుల కిట్‌ను అందజేస్తున్న డాక్టర్



వెంకటాచలం : ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న వైద్యులు



కొడవలూరు : కొత్తవంగల్లులో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు



పొదలకూరు : రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

31న ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈనెల 31వ తేదీన బుచ్చిరెడ్డిపాళెంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు టంగుటూరి మల్లికార్జునరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని ప్రతి గడపకు తాగునీరు అందించే అమృత్ 2.0 పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ సుబ్బరాజు

మనుబోలు : సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు విద్యార్థులకు సూచించారు. మనుబోలు కోదండరామపురంలోని విద్యానికేతన్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటిలో డెంగీ వ్యాధికి కారణమయ్యే దోమలు పెరుగుతాయని, వారానికోసారి డ్రైడే పాటించాలన్నారు. ఆయన వెంట స్కూల్ కరస్పాండెంట్ జగదీష్‌బాబు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం

పొదలకూరు : దసరా శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా చివరిరోజైన మంగళవారం రాత్రి పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు దేవస్థానం నిర్వాహకులు రాత్రి 7 గంటలకు మహిళలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించి అమ్మవారికి అలంకరించిన చీరలను విజేతలకు బహుమతులుగా అందజేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమాల్లో దేవస్థానం నిర్వాహకులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యాంప్రసాద్, దాసరి శ్రీనివాసులు, కొమ్మి వేణుగోపాల్, సన్నికంటి మురళి, చొప్పా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

రేపు బ్రహ్మానందస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : మండలంలోని బిరదవోలు పంచాయతీ చెర్లోపల్లి గ్రామంలో అఖండ పరిపూర్ణ బ్రహ్మానంద స్వామి వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరుగుతుందని గ్రామ భక్తబృందం బుధవారం తెలిపింది. గ్రామంలోని బ్రహ్మానంద ఆశ్రమంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తెల్లవారుజామున 5 గంటలకు మేలుకొలుపు, సుప్రభాతం, 6 గంటలకు నగర సంకీర్తన, 7 గంటలకు గీతాపారాయణం, 8.30 గంటలకు మహాత్ముల ఉపన్యాసాలు, 10 గంటలకు పూజా కార్యక్రమం, మధ్యాహ్నం 12.30కి భోజనాలు, ఒంటి గంట నుంచి 3 వరకు సమష్టి భజన, 2 గంటలకు హోమం, సాయంత్రం 4.30 గంటలకు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, రాత్రి 8 గంటలకు అన్నదాన కార్యక్రమం, 8.30కి పల్లకిసేవ ఉంటుందన్నారు.



బ్రహ్మానందస్వామి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు



పాల్గొన్న అధికారులు

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతోందని ఎంపీపీ గండ్లళ్ల శంకరయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలన్నారు. ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మండలంలో 8,911 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందుతోందని, వాటి అమలు పక్కాగా జరగాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో ప్రభుత్వం అందిస్తోన్న పథకాలు, వాటి వివరాలను తెలియజేశారు.

కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు కైలాసం లావణ్య, అద్దంకి మమత, వివిధ శాఖల అధికారుల, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించేలా శిక్షణ ఇస్తాం

- డీపీఎం కామాక్షి

మనుబోలు : పొదుపు మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేలా వారికి శిక్షణ ఇస్తామని డీఆర్‌డీఏ డీపీఎం కామాక్షి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పొదుపు మహిళలకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా సర్వే చేసి నెల్లూరు జిల్లాలో 13 మండలాలను విజన్ బిల్డింగ్ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిని మోడల్ మండలాలుగా తీర్చిదిద్దుతామని, ఇందులో మనుబోలు మండలం కూడా ఉందన్నారు. ఐదేళ్ల తరువాత మండల సమాఖ్య ఎలా ఉండాలో లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని పనిచేస్తామన్నారు. అనుకున్న లక్ష్యాలను సాధిస్తామన్నారు. అధికారులతో సంబంధం లేకుండా స్వయం నిర్ణయాలు తీసుకునేలా వారిని తయారు చేస్తామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. నాలుగు రోజుల శిక్షణా శిబిరంలో భవిష్యత్తు కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఏపీఎం వనజాక్షి, సంఘ బంధం అధ్యక్షురాలు నాగమణి, సీసీలు జయమ్మ, ధనమ్మ, దేవమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న డీపీఎం కామాక్షి

విశేషాలంకరణల్లో అమ్మవారు



మనుబోలు: భద్రకాళి అలంకారంలో..



మనుబోలు: అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



పొదలకూరు : దర్బారు అలంకారంలో అమ్మవారు

మనుబోలు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మనుబోలు మండల కేంద్రంలో బుధవారం అమ్మవారు భద్రకాళి, రాజరాజేశ్వరీదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామపురం పోలేరమ్మ గుడి వద్ద అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి భద్రకాళి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అలాగే మనుబోలు దసరా చావడి వద్ద అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలుగా వేలూరు భాస్కర్‌రెడ్డి, భాగవతుల సురేష్–పద్మ దంపతులు వ్యవహరించారు.

దర్బారు అలంకారంలో..

పొదలకూరు : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు బుధవారం దర్బారు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తన్నీరు మోహన్‌రావు, సురేష్ వ్యవహరించారు. ఉదయం లలిత సహస్రనామార్చన, ఖడ్గమాల, త్రిశతి కార్యక్రమాలను నిర్వహించారు.

వేడుకగా వసంతోత్సవం



దర్బారు అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. సాయంత్రం దర్బారు అలంకారం గావించారు. అమ్మవారు దివ్యరూపంలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మల్లెపూలతో విశేషంగా అలంకరించారు. వసంతోత్సవానికి ఉభయకర్తలుగా మేడా మల్లికార్జునరావు, మల్లీశ్వరి దంపతులు, కామేశ్వరరావు, విద్య కామాక్షిసాత్విక, కార్తికేయ చేతన్, దర్బారు అలంకారం ఉభయకర్తలుగా ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ వారు వ్యవహరించారు.

ముగిసిన మహాకుంభాభిషేక మహోత్సవాలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కోవూరు : మండల కేంద్రంలోని కోదండరామస్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా నూతన ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, సిద్ధాంతి అనంత పద్మనాభ ప్రసాద్ స్వామి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు, శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు నాగరాజస్వామి, భాను స్వామి, రుత్వికులు ఉన్నారు. ఈ సందర్భంగా డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాంప్రదాయబద్ధంగా..

మహాకుంభాభిషేకంలో భాగంగా విమాన శిఖర ప్రతిష్ఠాభిషేక కార్యక్రమాలను రుత్వికుల పర్యవేక్షణలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు భారీస్థాయిలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

విడవలూరు : మండలంలోని వరిణి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ ఆర్.మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇళ్ల స్థలం మంజూరవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వి.భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.



వర్క్ ఆర్డర్ అందజేత

పొదలకూరు : మండలంలోని మరుపూరుకు చెందిన బాలకృష్ణారెడ్డి అనే రైతు తోటలో ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీపై ప్యాక్‌హౌస్ నిర్మాణానికి వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా బుధవారం వర్క్ఆర్డర్(అనుమతి పత్రం) అందుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యాన పంటలు ఎండలు, వానకు దెబ్బతినకుండా ప్యాక్‌హౌస్‌లను నిర్మించుకునేందుకు ప్రభుత్వం రాయితీని అందజేస్తున్నట్లు తెలిపారు. రూ.4 లక్షల అంచనా విలువతో రైతు ప్యాక్‌హౌస్‌ను నిర్మించుకుంటే ఉద్యానశాఖ రూ.2 లక్షలు రాయితీ మొత్తాన్ని అందజేస్తుందన్నారు. ఉద్యానాధికారి ఈ.ఆనంద్, ఏఓ ఎ.వాసు పాల్గొన్నారు.



వర్క్ఆర్డర్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ